

# సతి

కేతు విశ్వనాథరెడ్డి

ఈశ్వరమ్మ ఉల్లితోటలో తనుండే మునుములోని కలుపు చకచకా తీస్తోంది. మిగతా మునుముల్లోని కూలీలకంటే పనిలో ముందుంది. ఈశ్వరమ్మ మునుములోనే, పక్క కయ్యలో కలుపు తీస్తున్న లూర్దమ్మ మెచ్చుకోలుగా అంది-

''ఈశ్వరమ్మ పనిమంతురాలు. ఆ పనితనం మరెవరికీ లేదు. పట్టుదలా అంతే.''

''పనికొచ్చి, ఒకర్తో మాటలెందుకు పడాల?'' ఈశ్వరమ్మ నవ్వుతూ లిక్కితో కలుపు తీస్తూనే అంది.

''అందుకేనమ్మా. మొగుడు సాధుల్లో కల్సి ఇన్నేండ్లయినా, అభిమానంతో బతుకుతున్నావు- తొమ్మిదేండ్ల ఆడపిల్లను గుండెలమీద పెట్టుకొని, మూలబడిన ముసలిదాన్ని నెత్తిన బెట్టుకొని. మా బతుక్కు పనితనమూ లేదు; పట్టుదలా లేదు. మా సిగ్గుమండా, అభిమానమూ లేదు- వట్టిపోయిన ఎనుముల మాదిరి బతకడం తప్ప. మా ఖర్మ.'' అవతలి మునుంలో చాలా వెనుకబడిన సాతాని చిన్నక్క నిజాయితీ స్వరంతో అంది.

గొల్ల చిన్నక్క తన భర్తను జ్ఞాపకం చేసేసరికి, ఈశ్వరమ్మ చేతిలోని లిక్కి మరింత వేగంగా కదిలింది. కానీ ఆమె మనసు చెదిరింది. ఒక్కసారి ఆకాశంవైపు చూసి, ఎడమ చేత్తో కొంగు తీసుకొని, ముఖంమీద చెమటలు తుడుచుకొని, తలకు నుదురుతాకే వరకూ కట్టుకున్న కొంగును సరిచేసుకుంది. తన మునుములోని పక్క కయ్యలో కలుపు తీస్తున్న లూర్దమ్మ తన దాకా పక్కన చేరేవరకూ, తీసిన కలుపునే కాసేపు తీసింది. లూర్దమ్మ పక్కకొస్తూనే ఈశ్వరమ్మ గొంతు తగ్గించి, అడిగింది.

''లూర్దమ్మా!''

''ఏం ఈశ్వరమ్మా?''

''మీవాళ్లల్లో సాధుల్లో కలిసే మొగోళ్లుంటారా?''

''ఉండకేమమ్మా, స్వాములోర్లుంటారు''.

''కట్టుకున్న పెండ్లాల్ను వదిలేసి స్వాములోర్లవుతారా?''

''ఛ ఛ, మా మతంలో ఇంత అన్యాయం లేదమ్మా. మొగోళ్లయితే పెండ్లి చేసుకోకుండానే స్వాములోర్లవుతారు. కన్నెలయితే మిస్సమ్మలవుతారనుకుంటా - అదేదో బసివిరాండ్ర మాదిరి. నాకు పెద్దగా తెల్దనుకో. మనూరికి స్వాములోరొచ్చినప్పుడు అడిగితే తెలుస్తుంది.''

''పెండ్లాలున్నోళ్లు సాములోర్లు కాలేరా?''

''అయ్యేదుంది. మా వాళ్లలో వేరే తెగ ఉంది. వాళ్లల్లో పెండ్లి చేసుకొని బిడ్డల్ను కన్నా, సంసారం చేస్తున్నా ఫాదిరీలుగా ఉండొచ్చు. ఏం?''

''ఏం లేదులే. ఆడోళ్లను గాలికొదిలేసి సాధుల్లో, సన్నాసుల్లో కలిసేది మాదాంట్లోనే ఉందా? మీదాంట్లో కూడా ఉందా? తెల్సుకోవాలనిపించింది... సాయిబుల్లో ఎట్లుందో?''

''ఏమో! మన ఫాతిమా నడిగితే తెలవ్వచ్చు.''

ఫాతిమా మూడో మునుములోని ఆరో కయ్యలో ఉంది. ఇద్దరూ చూశారు.

''మీ గుసగుసలేంది? మేం యినకూడదా?'' సాతాని చిన్నక్క అట్లా అడిగింది; ఇట్లా కలుపు పాట ఎత్తుకుంది.

ముంతేడు జొన్నలిస్త
మునగపూల దండలిస్త
వస్తారేమొ కాంతలార
కలుపు తీయనూ...

ఈశ్వరమ్మ అన్నీ మరచిపోయినట్లు వంతను అందుకుంది.

రాంపో రామిరెడ్డి

రాపటెండకు

ఈ రాపటెండకు

వంత ఒక వరస సాగింది.

'ముంతేడు కొర్రలిస్త' అని మరొక వరసను చిన్నక్క అందుకుంది. నలువురూ అందుకున్నారు. ఈశ్వరమ్మ అప్రయత్నంగా తల ఎత్తింది. తోటలలోకి హడావుడిగా వస్తున్న కూతుర్ని ఈశ్వరమ్మ చూసింది. దూరం నుంచే ఆ పిల్ల గొంతెత్తి ఆనంద ప్రకటనం చేసింది:

''అమ్మా... అమ్మా... నాయనొచ్చినాడే. ఇంట్లో ఉండాడే''

చిన్నక్క పాట ఆపి, మాట విసిరింది.

''పెండ్లాం గాలి ఇన్నాల్లకు సోకిందేమో!''

లూర్దమ్మ కసురుకుంది.

''అందరికీ నీ మొగుడి రంధే ఉంటాదను కుంటావు''

చిన్నక్క పకపక నవ్వింది. నములుతున్న వక్కాకు ఎర్రటి ఎంగిలి రెండు వేళ్ల మద్య నుంచి ఊసింది.

''సాధుల్లో కల్సిపాయినాడనుకున్న రెడ్డొచ్చినాడు. ఈశ్వరమ్మ బాధలు పడినన్నాల్లూ పడింది. ఇంగ నన్నా...'' లూర్దమ్మ ఆపేక్షతో అంది.

రెండో మునుములో కలుపు తీస్తున్న పెద్ద మునెమ్మకు ఈశ్వరమ్మ జీవితమూ, తన ఎరుకలోని ఆడవాళ్ల జీవితమూ మనసులో మెదిలాయో ఏమో, తనకు అలవాటయిన సాధారణీకరణ సత్యం చెప్పింది.

''రాత, అంతా రాతనుబట్టే మన ఆడోల్ల బతుకులు.''

ఈశ్వరమ్మ ఎవరూ చూడకుండా చెంగుతో కళ్లొత్తుకుంది.

మునెమ్మ తను చెప్పిన సత్యానికి రుజువును చెప్పలేకపోయింది.

''లేకపోతే ఈశ్వరమ్మ ఇట్లుండేదా? పెండ్లయిన కొత్తల్లో ఎంత సక్కంగ ఉండేది? పొడుగ్గా, సన్నంగా, నలుపైతేనేం? సూడసక్కని మొగం. రూపాయంత బొట్టు పెట్టుకోని తొండూరు అరవయ్యో నెంబరు సిలకపచ్చ సీర కట్టుకోని, ఎండి వడ్డాణం పెట్టుకోని, పక్కాకు నముల్తా తిరుగుతా ఉంటే, ఇంగా ఇంగా సూడ బుద్ధయ్యేది. మాయదారి దేముడికి కన్నుకుట్టి, రెడ్డి సాదుల్లో కల్సిపాయె. పదెకరాల గుండెకాయ అసుమంటి రేగటి అప్పులోల్ల పాలాయె. మానుబావుడు ఇండ్లన్నా మిగిలిచ్చె. ఈ పిల్లదాన్ని కస్టంసేసి ఎట్లా సాది సాకిందో ఆ బగమంతుడి కెరిక''.

ఈశ్వరమ్మ కథను మునెమ్మ పూర్తి చెయ్యటానికి అంది.

''రెడ్డయినా మంచోడే. సిల్లర బుద్దుల్లేవు. తాగింది లేదు. తందనాలాడింది లేదు. ఎముకలేని సెయ్యి. మోసమెరగని బుద్ధి. ఎంత కమ్మగా పాడేవాడనీ పదాలూ అవీ- జొన్న కోతలప్పుడు కోలాటం అయితే సెప్పాల్సిన పనిలేదు. ఎన్ని బజన్లు వచ్చునో? ఆ సెని క్కాయల యాపారంలో బారబ్బిని నమ్మె. ముదనస్ట పోడు నిలువునా ముంచె. యాస్టొంచ్చిదేమో! మనసిరిగి ఎల్లిపాయె - పెండ్లాం బతుకు బుగ్గిసేసి...''

''నాకేమైంది? ఈ పిల్లదాని దిగుల్లేకపోతే సచ్చినా బాధపడను'' ఈశ్వరమ్మ స్వాభిమానంతో బదులిచ్చింది.

ఈశ్వరమ్మ కూతురు దగ్గరికొస్తూనే, పదిమందీ ఆ పిల్ల ఏం చెబుతుందోనని కుతూహలంగా చూశారు.

''మీ నాయన ఎట్లా ఉండాడు? నీతో ఏం మాట్లాడినాడు?'' చిన్నక్క ఆత్రంగా అడిగింది.

ఆ పిల్ల గెస పోసుకుంటూ చెప్పింది.

''అబ్బ! చాలా బాగుండాడు. పొట్టిగా, సన్నంగా, గుండు చేసుకున్నాడు. బొట్టు పెట్టుకున్నాడు. అర చొక్కా వేసుకున్నాడు. అడ్డపంచ కట్టుకున్నాడు. అదేం రంగబ్బా. గంధం రంగులు ఉండాయి బట్టలు. ముందు ఏమీ మాట్లాడలా. పక్కింటి మామ చెప్పి నాడులే, 'మీ నాయన,' అని. కాళ్లూ మొగం కడుక్కు న్నాడు. ఒక పటం పెట్టుకున్నాడు. చాలాసేపు పూజ చేసినాడు. ఆ తర్వాత, 'అన్నముంటే పెట్టు లేకపోతే వద్దు,' అన్నాడు. ఒక అరముద్ద సంగటే తిన్నాడు. నేల మిందే పడుకోని, పుస్తకం సదువుకుంటున్నాడు. ఆ మర్చిపోయినా, 'నువ్వు అచలవా?' అన్నాడు.''

అచల పకపక నవ్వింది.

''నువ్వేమన్నావు?'' రెండో మునుములోని తలారి రామక్క అడిగింది.

''నేను అచలనే,'' అన్నా. అచల ఇంకా ఇంకా నవ్వింది. నవ్వు ఆపి, ''ఇంకేం అడగలా. ముజ్జేజితో కూడా ఏమీ మాట్లాడలా,'' అని ఆపింది.

''ఏడాది పిల్లగా ఉన్నప్పుడు సూసిందేనాయె,'' బోయ వీరమ్మ సానుభూతితో అంది.

ఈ ఉదంతంతో ఈశ్వరమ్మకు సంతోషమూ, ఉక్రోషమూ, బాధా ఒకేసారి కలిగాయి. బలవంతంగా

తన ఉద్వేగాల్ని అణచుకొంది. కలుపు తీయటంలో ఆ ఉద్వేగాన్ని ప్రదర్శించింది. గంభీరంగా ఉన్న ఈశ్వరమ్మను పలకరించే ధైర్యం ఎవరూ చేయలేదు. వాళ్లకు కుశాల ఈశ్వరమ్మా తెలుసు, పూనకం వచ్చే ముందున్నట్లుండే ఈశ్వరమ్మా తెలుసు.

విడుపు వేళ అయింది. కూలీలందరూ ఇళ్లదారి పట్టారు.

అచలను వెంటబెట్టుకుని, ఈశ్వరమ్మ ఇంటి కొచ్చింది. ముసలామె కుక్కి మంచంలో బొంతమీద నోరు తెరుచుకుని నిద్రపోతోంది. ఈశ్వరమ్మకు ఇంట్లో భర్త కన్పించలేదు.

"ఇప్పుడీన్నే ఉండెనే. ఈన్నే ఉండెనే. ఉండు పక్కింటి మామ ఉండాడేమో అడిగొస్తా," అంటూ అచల బయటకు పరుగుదీసింది. అయిదు నిముషాల్లో వచ్చి, "కొండమిందకు పోయినాడంట. ఇంటికి రాడంట," అంది, దిగులుగా.

'ఇన్నేండ్లు భరించినా, ఏమన్నా కానీ,' అని ఈశ్వరమ్మ అనుకుంది, గుండె నిబ్బరం చేసుకుంటూ.

పదిరోజులు గడిచాయి. ఆమె భర్త నారాయణ రెడ్డి ఇంటికి రానూలేదు. ఈశ్వరమ్మ పట్టించుకోనూ లేదు. అచలే తండ్రిని గురించి రెండు మూడు పర్యాయాలు అడిగింది. తల్లి గాంభీర్యాన్ని చూసి ప్రస్తావించటం మానుకుంది.

ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలోని కొండ మీద ఉండే ఈశ్వర దేవాలయంలో ఉన్నాడనీ, గొడ్లు కాసుకునేవాళ్లు ఏదైనా పెడితే తినటం, లేకపోతే లేదు అనీ, ఎప్పుడూ మౌనంగా, ధ్యానంలో ఉంటాడనీ, ఎవరైనా ఏదైనా చెప్పమని బలవంతం చేస్తే ఏదో తత్త్వం చెబుతాడనీ ఊళ్లోనూ, తోటల దగ్గరా వాళ్లూ వీళ్లూ అనుకున్నారు. ఈశ్వరమ్మ చెవిన ఈ విషయం పడింది.

ఒకరోజు తూర్పు వీధిలో, మరొకరోజు ఉత్తరం వీధిలో, మరొకరోజు దక్షిణం వీధిలో ఎవరో ఒకరిద్దరు రైతుల గడపల ముందు చీకటి పడుతూనే నిల్చుంటాడనీ, పెట్టమని అడగడనీ, ఏ ఒకరో యింత పెడితే మరొక ఇంటికి బిక్ష కోసం వెళ్లడనీ ఈశ్వరమ్మ వింది. భర్త తిరిగి వస్తాడని ఏమూలో ఈమధ్య కలిగిన ఆశ కూడా ఈశ్వరమ్మలో అంతరించింది. భర్త విషయంలో నయితే ఈశ్వరమ్మ గుండె బండ చేసుకుంది; కూతురు భవిష్యత్తు విషయమై కన్నీళ్లు పెట్టుకుంది. ఏం చేయాలని మధనపడింది.

ఆచలమ్మకు అప్పుడే తొమ్మిదో ఏడు వచ్చింది. మూడో తరగతి అయిపోతూనే చదువును తానే మాన్పించింది. పక్క పల్లెల పొలాల్లోకి కూలీ నాలీకి ఏ పొద్దున్నో పోతే, ఇంటిదగ్గర ముసల్ది ఉంది. బ్రమ్మచెవుడు. కళ్లకు ముదిరిపోయిన చుక్కలాలు. నడవడమే కష్టం. తను ఇంటికి వచ్చేదాకా ఆ ముసలామెకు ఇంత తిండి పెట్టే వాళ్లు, ఇన్ని నీళ్లు గొంతులో పోసేవాళ్లు- అచలమ్మే లేకపోతే- ఇంట్లో ఎవరున్నారు? వీధిలోవాళ్లు చూస్తారా? అందరికీ తడిపి మోపెడు పనులున్నాయి. అందుకే ఆ పిల్లదాని చదువును తాను మాన్పించింది. లూర్దమ్మ ముందు ఈ బాధలన్నీ వెల్లబోసుకుంటే, లూర్దమ్మ తనకు తోచింది తను చెప్పింది. 'పాపం, ముసలామెదేముంది? ఈ పొద్దో రేపో పొయ్యేది. అచలమ్మ సంగతే చూడు. నాలుగు కాలాలుండేది. మా సుగుణమ్మను పంపినట్లు మరియాపురం పంపితే బాగుండదా? కనీసం మనకంటే బాగా బతకడానికి పనికొచ్చే చదువు నేర్చుకుంటుంది. అచలమ్మ చాలా తెలివైందని ప్రకాశం టీచరు కూడా ఎప్పుడో అన్నాడు- అదిసరే. మన మాదిరే మన ఆడపిల్లలూ నోరూ వాయీ లేక కూలీ నాలీకి చావాలా?"

అంతా జ్ఞాపకం వచ్చి, ఏదో ఒకటి తేల్చుకోవాలని ఈశ్వరమ్మ గట్టిగా అనుకుంది.

ఈశ్వరమ్మ భర్త సాధు నారాయణ కీర్తి పల్లెలకు విస్తరించింది. ఊరికి కొంత దూరంలో ఉండే కామిశెట్టి వనంలో సాధు నారాయణకు ముందు ఒక గుడిసె ఏర్పాటయింది. వారసుల్లేని పక్క పల్లె తొగటోళ్ల ముసలామె బావి తవ్వించింది. "ఉప్పునీళ్ల కొంపలో బ్రహ్మాండంగా తియ్యటి నీళ్లు పడినాయి. సాధు నారాయణ చలవే," అని అంతా చెప్పుకున్నారు. మెల్లిగా ఆశ్రమ నిర్మాణం మొదలైంది. ఈలోగా గురుబోధలకు ఒక పందిరి ఏర్పాటైంది. ఎవరెవరు సహాయం చేస్తున్నారో, ఎక్కడెక్కడి నుంచి భక్తుల అండ ఉందో ఈశ్వరమ్మ ఏవేవో విన్నా పట్టించుకోలేదు. తన ఇంటిని అమ్మి ఆశ్రమానికి పెడుతున్నాడన్న వార్త ఈశ్వరమ్మ వరకు వచ్చినప్పుడు మాత్రం, ఆమె పూర్తిగా చలించింది.

తన బిడ్డకూ, ముసలామెకూ, తనకూ నీడ లేకుండా చేసిన విషయం నిజమో కాదో తేల్చుకుందామని రెడ్డి (గ్రామం మునసబు)ని కలుసుకుంది.

"నిజమే, బలిజ సుబ్బన్నకు అమ్మినాడు. సాక్షి సంతకం నేనే చేసినా," అన్నాడు రెడ్డి.

ఈశ్వరమ్మ తన గోడు వెళ్లబోసుకుంది.

"చూడన్నా! నువ్వన్నీ తెలిసినోడివి. మిగిలింది ఈ మిద్దె. అదీపోతే పిల్లదాని బతుకేం కావాల? పిల్ల పెండ్లి కొస్తే కూలికి పొయ్యేవాడు కూడా ఎంతిస్తావంటాడే.

నీకు తెల్దా? మావాళ్లు (భర్త) సంసారం విడిచి సాధుల్లో కల్సిపోయినా సాటి కాపోళ్లలో మాట రాకుండా ఇన్నేండ్లు బతికినా. బాలింతరాలుగా ఉన్నప్పుడే మావాళ్ల తల్లి చచ్చిపోయిందట. నాయన ఏ అయిదేండ్లప్పుడో పోయినాడంట. మరి అప్పట్నుంచి మావాళ్లను సాకి సంతరించిన ముసలామె ఇంకా బతికే ఉంది. ఆమెను నామీదనే వదిలిపాయె. కట్టుకున్నదాన్ని వదిలె. కన్న బిడ్డను వదిలె. పోనీలే అని మొండికిబడ్డా. నేను సరే పరాయిదాన్ని. కన్నబిడ్డ సరే- ఇద్దరి బిడ్డా. మరి ముస లామెది తన రక్తం గద. ఆమెను సాకడానికి నాకేమొచ్చె- యాణ్ణించో వచ్చినదానికి? అయినా చిన్న బిడ్డను సాకి నట్లు ముసలామెను సాకుతున్నా. మా వాళ్లకు దయా ధర్మం లేదా? న్యాయం చెప్పండి?''

ఈశ్వరమ్మ చెప్పిన దాంట్లో రెడ్డికి న్యాయం కన్పించకపోలేదు. కానీ సాధు నారాయణ చేసిన పని అధర్మమని పంచాయితీ పెట్టించలేడు. అది సాధు నారాయణ ఆస్తి! నెత్తిగోక్కుంటూ, ఈశ్వరమ్మవైపు చూడకుండా, తనెటు వైపున్నదీ చెప్పాడు.

''నేనేం చెయ్యలేను ఈశ్వరమ్మా! నువ్వు మన కుదురులోని దానివి. ఇన్నేండ్లు ఒకరితో మాట పడ కుండా బతికినావు. మన వాళ్లందరికీ అది సంతోషమే... సాధు నారాయణ విషయం కూడా చూడు. మనం చూసినోడేలే అనుకుంటే గొప్పతనం తెలియదు. ముప్ప యేండ్ల కిందట మనూరు విడిచిపోయి కడపలో వ్యాపారం పెట్టిన పుల్లయశెట్టి వాళ్ల అబ్బ పేరుతో వున్న ఆ ఎకరా వనాన్ని ఆశ్రమం కోసం ఇచ్చె. సాధు నారాయణ గురే లేకుంటే ఇస్తాడా చెప్పు. అదట్లా ఉంచు. పరుల సొమ్ము దండి, ఆశ్రమం కట్టించినాడని ఇప్పుడెవ్వరూ అన్లేరుగదా? ఊరు మంచికే ఇది జరిగిం దేమో ఆలోచించు. నువ్వు కావాలంటే, మన కళ్లంలోని గూడ మిద్దెలో ఉండు. బాడుగ అడిగితే ఒట్టు.''

రెడ్డిని విన్నాక, ఈశ్వరమ్మ ఇంకెవరితో మొత్తు కున్నా ప్రయోజనం లేదనుకుంది. ఉండబట్టలేక మనసులో మెదలిన దాన్నంతా కూతురును ఒళ్లో పెట్టు కుని చెప్పి చెప్పి ఏడ్చింది. ఏడుస్తూ ఏడుస్తూ చెప్పింది. అచలకు అమ్మ చెప్పింది కొంత అర్థమైంది. కొంత కాలేదు. చివర్లో అంది.

''పోన్లే అమ్మా. సాధు నాయన గొప్పోడంటలే. చూసినోళ్లంతా కాళ్లమీద పడతా ఉండారంట. యాణ్ణుం చాన్నుంచో పాడటానికి వస్తాండారంట. రోజా రాత్రి పూట ఏమిటో పాడతాడంట. చెప్తాడంట. చానా చానా బాగుంటుందంట. మనమూ ఒకరోజు పోదాం.''

ఈశ్వరమ్మ ఏదో నిశ్చయానికి వచ్చినట్టు, ''ఈ పొద్దే పోదాంలే'' అంది- ఆరిన కన్నీళ్లతో, గుండె దిటవు తో. చీకటిపడ్డాక అచలను వెంటబెట్టుకుని ఈశ్వరమ్మ ఆశ్రమంలోకి అడుగుపెట్టింది. ఆవాళ శుక్ల ఏకాదశి.

పందిరి మొదట్లో మట్టి అరుగుంది. అరుగుమీద మూడు పెద్ద పటాలున్నాయి. వాటిముందు రెండు దీపింతెలు వెలుగుతున్నాయి. పందిరిలో నేలంతా అలికి ముగ్గులు పెట్టి ఉంది. అరుగు కింద నేలమీదనే సాధునారాయణ పద్మాసనం వేసుకుని ధ్యానంలో వున్నాడు. పందిరిలో మగవాళ్లే ఎక్కువ ఉన్నారు. అందరూ కళ్లు మూసుకొనే ఉన్నారు. అందరి చివరలో ఈశ్వరమ్మ కూతురును పక్కన కూర్చోబెట్టుకొని తానూ కూర్చుంది.

''అందులో ఒకటి వేమన పటం కదామ్మా,'' అచల కూతుహలంగా అంది.

ఈశ్వరమ్మ తల ఊపింది.

సాధు నారాయణ కళ్లు తెరిచి పక్కనున్న ఏక నాదం అందుకొని తీగను మీటాడు.

అందరూ కళ్లు తెరిచారు. బలిఘట్టంలో నేర్చు కున్న తత్త్వాన్ని ఏకనాదం మీటుతూ సాధునారాయణ శ్రావ్యంగా గొంతెత్తి పాడసాగాడు.

*అయ్యేదల్లా కాని- పాపిష్టి ఘటమునకె కాని*
*పొయ్యేదల్లా పోని- సద్గురు పూర్వ పుణ్యమబ్బని*
*యీ పొద్దు వచ్చింది పోని- యింకా పైన*
*అప్పుగాని*
*కాపురంలో జూచిన గాని - కాసు లేకుండా పోని*
*అయ్యేదల్లా కాని...*
*కాని వారు నన్ను జూచి - కాని మాటలాడుకోని*
*లేని పోని దూరులొస్తె- లేశమైనా భయము వద్దు*
*అయ్యేదల్లా కాని...*
*తల్లిదండ్రీ ధనములొద్దు - యిల్లాలితో సుఖము*
*లొద్దు*
*యిల్లు లేకా యెడమూలైతే - యింకేమి*
*భయము కద్దూ?*
*అయ్యేదల్లా కాని..*
*దొరలు జూచి మెచ్చావద్దు- దొరికిన భిక్షమే కద్దూ*
*యోగి వరులూ నన్నుజూచీ*
*యోగి కాడన్నదే ముద్దూ*
*అయ్యేదల్లా కాని - పాపిష్టి ఘటమునకె కాని*
*పొయ్యేదల్లా పోని - సద్గురు పుణ్యమబ్బని*

తత్వం ఆగింది. సాధు నారాయణ కళ్లు మూసుకొని తాను నిశ్చలంగా ఉండి తీగను మీటుతూనే వున్నాడు.

"అబ్బ ఎంత బాగా పాడినాడమ్మా," తల్లితో గుసగుసలాడింది అచల.

స్వర మాధుర్యం - ఏకనాదంతో కలిసిన లయ - ఈశ్వరమ్మను కూడా కదిలించకపోలేదు. ఆమెలోని తెగింపు ముందు అది వీగిపోయింది. మొండికి బడి, ముందు అందర్నీ కలియజూసి, భర్తనుద్దేశించి అంది.

"నీకు అయ్యేది అయింది; పొయ్యేది పోయింది. ఇక్కడికొచ్చినోళ్లంతా అట్లనే అనుకుంటే, ఈ కాపురాలెందుకు? కాల్చనా?"

సాధు నారాయణ బదులు పలుకలేదు. ఏకనాదం ఆగింది. కళ్లు తెరిచి మళ్లీ కళ్లు మూసుకున్నాడు.

కట్టుబడి గంగన్న వెనక్కి తిరిగి బతిమాలే ధోరణిలో అన్నాడు.

"ఊరుకోమ్మా ఈశ్వరమ్మ తల్లీ! ఊరుకో అట్లా అనకూడదు."

ఈశ్వరమ్మ విసురుగా లేచింది. జారిన జుట్టును ముడివేసుకొంది. అచలను రెక్కపట్టుకొని లేచింది. రెచ్చిపోయి అంది-

"ఏంది ఊరుకునేది? మీ మగనాబట్టలంతా అంతే. మమ్మల్ని పడి ఉండమంటారు. గొంతులు కోస్తారు. పెండ్లిండ్లు సేసుకోకుండా మీ వేదాంతాలు మాట్లాడండి; వినండి. ఎవరొద్దన్నారు? ముందు ఈ పిల్ల బతుకేం కావాలో ఈ తత్వం వినేవాళ్లంతా చెప్పండి. ఉన్న కొంపకూడా గుండమైంది. నా కూతురూ సాధుల్లో కల్సిపోవాల్సిందేనా, అబ్బని మాదిరి? జరగబొయ్యేది తెలిసే అచల అని ముందే పేరు పెట్నాడా, అబ్బడు? అవున్లే అదే మేలు. ఆడోళ్ల గొంతులు కోసే, మీ వేదాంతం కూలా? మీ మగ బతుకుల మీద పిడుగులు బడా?"

ఏం చేస్తుందో తెలియని ఆవేశం ఈశ్వరమ్మకు వచ్చింది. పందిరి గుంజమీద చేతులకున్న గాజుల్ని పలాపలా పగలగొట్టుకుంది; బొట్టు చెరుపుకుంది; మెళ్లో తాడు తెంపుకుంది.

"ఎట్లాగా కొంప లేదు. రెడ్డి చెప్పినట్లు వాళ్ల కళ్లంలో గూడమిద్దెలో ఉండడంకన్నా మతం తీసుకుని మాలిండ్లతో ఉండడం మేలు. అదే మేలు. అక్కడే బతికి నా మాదిరి, ఆ ముసలి ఆడోళ్ల మాదిరి నా కూతురు బతక్కుండా చేస్తా..."

అచలను ఈశ్వరమ్మ బరబరా లాక్కుపోతూ ఊగిపోతూ అంది. అచల వెక్కివెక్కి ఏడుస్తోంది. అక్కడున్నవాళ్లకు నోటమాట పెగిలితే ఒట్టు.

*రచన మాసపత్రిక, డిసెంబర్ 1992*

